సాక్షి
మెదక్
శుక్రవారం। 21। ఏప్రిల్। 2023



కేతకిలో నేటి నుంచి శతచండీ మహాయాగం 8లో

లోక కల్యాణార్థం కేతకి సంగమేశ్వర ఆలయ ఆవరణలో నేటి నుంచి మూడు రోజుల పాటు శత చండీ మహాయాగం నిర్వహించనున్నారు.




పురుగుల బియ్యం తినేదెలా?

చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట్‌లో రేషన్ తీసుకునేందుకు వెళ్లిన లబ్ధిదారులు బియ్యం సంచులు పురుగులు పట్టి, తెట్టెలు కట్టి ఉండడం చూసి అవాక్కయ్యారు. 9లో

ఆర్టీసీలో పదోన్నతులు

మెదక్ కలెక్టరేట్: మెదక్ ఆర్టీసీ రీజియన్‌లో వివిధ డిపోలకు చెందిన కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు కలిపి మొత్తం 35 మందికి సూపర్‌వైజర్‌గా పదోన్నతి కల్పించామని ఆర్‌ఎం సుదర్శన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ నష్టాల్లో ఉన్నప్పటికీ ఎండీ ఆదేశాల మేరకు పదోన్నతులు ఇచ్చామన్నారు. అంకితభావంతో పనిచేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం ఆర్డర్ కాపీలు అందజేశారు.



అటవీ.. హాంఫట్

యథేచ్ఛగా భూముల ఆక్రమణ | పట్టించుకోని అధికారులు

పాపన్నపేట(మెదక్): ఆక్రమణదారుల భూ దాహానికి అడవులు నేలమట్టమవుతున్నాయి. రూ. లక్షలు వెచ్చించి పెంచిన పచ్చని మొక్కలను కల్టివేటర్లతో దున్నేస్తున్నారు. 70వ కంపార్ట్‌మెంట్‌లోని నామాపూర్, నామాపూర్ తండా, చిత్రియాల్ తండా, చంద్రు తండాల ప్రజలు పోటీపడి అటవీ భూములను పంచుకుంటున్నారు. అందిన కాడికి ఆక్రమించుకుంటున్నారు. సిద్ధ సైన్యంతో కర్రలు పట్టుకొని రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కబ్జా దారులకు అండగా నిలుస్తున్నారు. విచిత్రమేమిటంటే ఓ గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను అడవిని దున్నేందుకు వాడుతున్నారు. కళ్ల ముందే హరిత హననం కొనసాగుతున్నా అటవీ శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. అలాగే మండల పరిధిలోని అన్నారం, అబ్లాపూర్, అమ్రియా తండా, సోమ్లా తండాల్లో సైతం అటవీ విధ్వంసం కొనసాగుతుంది.

సుమారు 90 హెక్టార్ల అటవీ భూమి

పాపన్నపేట మండలంలోని అటవీ శాఖ పరిధిలో గల 70వ కంపార్ట్ మెంట్‌లో సుమారు 90 హెక్టార్ల అటవీ భూమి ఉంది. ఆక్రమణల నుంచి రక్షించుకోవడానికి చుట్టూ కందకాలు ఉన్నాయి. 1990లో ఇక్కడ నీలగిరి మొక్కలు పెంచారు. అనంతరం 2022లో వాటిని తొలగించి మిశ్రమ మొక్కలు నాటారు. వీటికి సుమారు రూ. 70 లక్షలు ఖర్చుగా అంచనా వేశారు. నామాపూర్, చిత్రియాల్ తండా అటవీ ప్రాంతంలో మొక్కలు ఏపుగా పెరిగాయి.

పోడు చట్టం తెరపైకి రావడంతో..

ఇటీవల పోడు భూముల చట్టం తెరపైకి రావడంతో చాలా మంది అక్రమార్కుల కన్ను అటవీ భూములపై పడింది. వెంటనే వారు రంగంలోకి దిగి అడవులను అడ్డంగా నరికివేయడం మొదలుపెట్టారు. అడ్డుకోబోయిన అటవీ శాఖ అధికారులపై గతేడాది నవంబర్ 17వ తేదీన దాడికి దిగారు. దాడిలో పలువురు గాయపడగా.. కేసులు సైతం నమోదయ్యాయి. కానీ ఆక్రమించుకున్న భూమి మాత్రం ఇప్పటికీ ఆక్రమణదారుల కబ్జాలోనే ఉంది.

ఏకమై.. చందాలు వేసుకొని

కబ్జాదారులంతా ఏకమై కొంత నిధిని సమకూర్చుకున్నారు. తలా కొన్ని పైసలు జమ చేసుకొని సుమారు రూ. 30 లక్షలు వసూలు చేశారని తెలుస్తోంది. వీటిలో కొంత భాగం అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పైరవీ కారులకు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. కేసులు నమోదైతే ఈ నిధి నుంచే ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద హరిత హననానికి అడ్డం లేకుండా పకడ్బందీ ప్లాన్ రూపొందించుకున్నారు. అయితే అటవీ ఆక్రమణపై అధికారులకు ఫోన్ చేస్తే కట్ చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.



ఆక్రమణకు ముందు..



ఆక్రమణ తర్వాత..

పీడీ యాక్ట్ పెడతాం

అటవీ భూములు ఆక్రమించుకుంటున్న వారిపై పీడీ యాక్ట్ పెడతాం. గతంలో అధికారులపై దాడికి పాల్పడిన వారు, భూములు ఆక్రమించుకున్న వారిపై కేసులు నమోదు చేశాం. పదే పదే ఫోన్లు చేస్తుండడంతో కట్ చేసి ఉండొచ్చు. ప్రస్తుతం అధికారులను పంపి ఆక్రమణను అడ్డుకుంటాం.

– రవిప్రసాద్, డీఎఫ్‌ఓ, మెదక్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, పక్కన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మే నెలాఖరు నాటికి పూర్తి చేయండి

'మనఊరు-మనబడి' పనులపై కలెక్టర్ రాజర్షిషా సమీక్ష

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో మన ఊరు–మనబడి పనులకు సంబంధించి పుష్కలంగా నిధులు ఉన్నాయని కాంట్రాక్టర్లకు భరోసా కల్పించి వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి మండలాల వారీగా పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణ పనుల ప్రగతిపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రూ. 30 లక్షల లోపు పనులను మే నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. నిధుల కొరత లేదని కాంట్రాక్టర్లకు అవగాహన, భరోసా కల్పించి వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేసేలా కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. కోటి రూపాయలకు పైగా పనులుండి టెండర్లు రాని వాటికి సంబంధిత ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్లు పాల్గొని పనులు చేపట్టేలా చూడాలని ఆదేశించారు. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు కొత్తగా ఎవరూ ముందుకు రాకుంటే మీ వద్ద ఉన్నవారితోనే చేయించాలని ఇంజినీరింగ్ అధికారులకు చెప్పారు. నేడు (శుక్రవారం) ఇంజినీరింగ్ అధికారులు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలు, మండల నోడల్ అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. సాంకేతిక అనుమతులు లేని వాటికి వెంటనే మంజూరు ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి, నీటిపారుదల ఈఈ శ్రీనివాస్‌రావు, డిప్యూటీ ఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

కొల్చారం(నర్సాపూర్): మెదక్ రూరల్ సర్కిల్ పరిధిలోని కొల్చారం పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేసులకు సంబంధించిన ఫైళ్లు, రికార్డులను పరిశీలించారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని ఆదేశించారు. నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవాలని సూచించారు. జిల్లాలో పటిష్టమైన పోలీసు వ్యవస్థ ఉందని.. ప్రజలకు అన్ని విధాల రక్షణ, భద్రత ఉంటుందని పేర్కొన్నారు. నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాల ప్రాధాన్యం ఎక్కువగా ఉందని, ఆ దిశగా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్ సిబ్బంది విధి విధానాలను సూచించే 5ఎస్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ సైదులు, రూరల్ సీఐ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని



ఇఫ్తార్ విందులో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్

పవిత్రమాసం రంజాన్

చేగుంట(తూప్రాన్): రంజాన్ పవిత్ర మాసమని.. ఉపవాస దీక్షలు ఎంతో గొప్పవని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన చేగుంటలో గురువారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌తో కలిసి ముస్లింలకు ముందస్తు పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెంగళ్‌రావ్, ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, పట్నం తానీషా, మహ్మద్ అలీ, సయ్యద్, ముస్లిం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం'

మెదక్ కలెక్టరేట్: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాడుతామని వీఓఏలు స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఎదుట వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులకు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. గుర్తింపు వస్తుందని ఏళ్ల తరబడిగా ఎదురు చూస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సాయాగౌడ్, ప్రధాన కార్యదర్శి స్వరూపరాణి, కోశాధికారి కవిత, తదితరులు పాల్గొన్నారు.



నిర్లక్ష్యానికి నిదర్శనం

తూప్రాన్: పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల నుంచి కిష్టాపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు తొలగించకుండానే సదరు కాంట్రాక్టర్ కంకర రోడ్డు నిర్మించాడు. త్వరలోనే బీటీ రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి. అయితే విద్యుత్ స్తంభాలు తొలగించకుండానే రోడ్డు పనులు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పకడ్బందీగా గొర్రెల పంపిణీ



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, చిత్రంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

కలెక్టర్ రాజర్షిషా

చిన్నశంకరంపేట(మెదక్): యాదవులకు అందిస్తున్న గొర్రెల పంపిణీకి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. గురువారం మండల కేంద్రంలో గొర్రెల కాపరులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారుడు తన వాటా డబ్బులు రూ. 43,750 నేరుగా ఖాతాలో జమ చేయాలని కోరారు. ఈసారి ఏపీలోని కర్నూల్, కడప, కర్ణాటక నుంచి దేవగిరి, చిత్రగుర్ నుంచి గొర్రెలు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. గొర్రెల కొనుగోలు నుంచి గ్రామానికి చేరుకునే వరకు అధికారుల పర్యవేక్షణతో పాటు సహకారం ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గొర్రెల కాపరుల సంపదను వృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ ముందు చూపుతో గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల కోసం బ్యాంకు ఖాతాలో జమచేసే డబ్బులను పాత బకాయిలకు జమ చేసుకోకుండా బ్యాంకర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఎలాంటి అనుమానాలు పెట్టుకోకుండా లబ్ధిదారుడి వాటా ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి విజయ్‌శేఖర్ రెడ్డి, మండల పశువైద్యాధికారి గీతామాలిక, తహసీల్దార్ మహేందర్‌గౌడ్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్‌లు పూలపల్లి యాదగిరి, రాజిరెడ్డి, దయానంద్, సిద్దిరాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, మల్లమ్మ, యాదవరావు, మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ సర్వీస్ పొడిగించాలి



కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): సికింద్రాబాద్ నుంచి మనోహరాబాద్ రైల్వేస్టేషన్ వరకు ఎంఎంటీఎస్ సర్వీస్‌ను పొడగించాలని గురువారం కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలను బీజేపీ నాయకులు కోరారు. గురువారం గజ్వేల్ మీదుగా వెళ్తున్న ఆయనకు గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ వరిగంతం సాయికుమార్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మనోహరాబాద్ మండలం నగరానికి దగ్గరగా ఉండడం, పరిశ్రమల వాడ కావడంతో ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. మనోహరాబాద్ రైల్వేస్టేషన్ బ్రిటిష్ హయాం నుంచి కొనసాగుతుందని మంత్రికి వివరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో మెదక్ పార్లమెంటరీ కన్వీనర్ రామ్మోహన్‌గౌడ్, నాయకులు సాయికుమార్‌గౌడ్, నరేష్‌గౌడ్ తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గజగట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. గత ఆర్థిక సంవత్సరం నుంచి ఉపాధ్యాయులకు రావాల్సిన బిల్లులు ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. పీఆర్‌సీ గడువు ముగుస్తున్నందున నూతన పీఆర్‌సీ అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ప్రణీద్‌కుమార్, రాజ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర నాయకులు కర్రె పోచయ్య, నర్సింహులు, భూపతిగౌడ్, నాయకులు సిద్దిరాములు, గోపాల్, శివప్రసాద్, జబ్బార్, విఠల్, పెంటాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సదానందంగౌడ్

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి



సమావేశానికి హాజరైన కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా మార్చడానికి కృషి చేస్తానని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడక ముందు విద్యుత్ కోతలు, నీటి ఎద్దడి ఉండేదని.. నేడు అవి పరిష్కారమయ్యాయని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సంక్షేమ పథకాల జాడే లేదన్నారు. ఇప్పుడిప్పుడే బాగుపడుతున్న రైతులను బీజేపీ చులకన చేస్తుందన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా సీఎం కేసీఆర్ తలొగ్గలేదన్నారు. రామాయంపేటలో అదనంగా మరో రెండు వందల ఇళ్లు మంజూరు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో అభివృద్ధికి రూ. తొమ్మిది కోట్లు మంజూరు కాగా అదనంగా మరో రూ. పది కోట్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆత్మీయ సమ్మేళనానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, కార్యకర్తలు తరలివచ్చారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ఎమ్మెల్యే గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, సహకార సంఘం అధ్యక్షుడు బాదె చంద్రం, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు గజవాడ నాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు సరాపు యాదగిరి, రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి స్పార్కిల్స్ క్యాంపు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్, తదితరులు

మెదక్ కలెక్టరేట్: రేపటి నుంచి మే 6వ తేదీ వరకు మెదక్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో స్పార్కిల్స్ క్యాంపు నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ రమేశ్ తెలిపారు. గురువారం క్యాంపునకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెస్టర్న్ డాన్స్, వేదిక్ మాథ్స్, మ్యూజిక్, లైఫ్ స్కిల్స్, స్పార్కిల్స్‌పై క్యాంపు నిర్వహించనున్నామని చెప్పారు. ఇందులో సాంఘిక, గిరిజన సంక్షేమం, ఏకలవ్య పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు వరలక్ష్మి, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతాపూర్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి గానూ 1వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో ఆరుగురు విద్యార్థుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఇన్‌చార్జి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఇందులో 4 సీట్లు బాలురకు, 2 సీట్లు బాలికలకు ఉన్నాయని చెప్పారు. దరఖాస్తు ఫారాలను కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉచితంగా పొంది.. ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా సమర్పించాలని సూచించారు. మే 3వ తేదీన ఉదయం 11 గంటలకు జిల్లా ఎంపిక కమిటీ, కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా డ్రా తీసి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేటలో గురువారం మహిళలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ యోజన, ఉచిత బియ్యం, ఉపాధి హామీతో పాటు పలు పథకాలకు కేంద్రం అందిస్తున్న నిధులను గురించి వివరించారు. రాష్ట్రంలో మరిన్ని పథకాలు అమలు చేయాలంటే రాబోయే రోజుల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వీణ, ఉపాధ్యక్షురాలు గడ్డమీది సుజాత, మండల అధ్యక్షురాలు లావణ్య, మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, నియోజకవర్గ కో కన్వీనర్ గోవింద్, జ్యోతి, పద్మ, శోభన్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అధికారికంగా బసవేశ్వర జయంతి

మెదక్ కలెక్టరేట్: ఈనెల 23న మహాత్మా బసవేశ్వర జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని కలెక్టర్ రాజర్షిషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం పదిన్నర గంటలకు కలెక్టరేట్‌లో బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

25న అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్

మెదక్ కలెక్టరేట్: లీగల్ లిటరసీ క్యాంపులో భాగంగా ఈనెల 25వ తేదీన అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో కొల్చారం మండలం పోతంశెట్టిపల్లిలోని రైతు వేదికలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం మెదక్ కోర్టు ప్రాంగణంలో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న టీచర్‌ మృతి


భానోతు రవీందర్‌ (ఫైల్‌)

అక్కన్నపేట(హుస్నాబాద్‌): మండల పరిధిలోని అంతక్కపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న బయాలజికల్‌ సైన్స్‌ ఉపాధ్యాయుడు భానోతు రవీందర్‌(43) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పాఠశాల హెచ్‌ఎం రంగనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌ జిల్లా సైదాపూర్‌ మండల పరిధిలోని రాయికల్‌తండాకు చెందిన రవీందర్‌ 2018లో అంతక్కపేట పాఠశాలకు వచ్చాడు. మూడు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్‌ జిల్లాలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఆసుపత్రిలో గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సిద్దిపేటకమాన్‌: కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం లభ్యమైంది. సిద్దిపేట వన్‌టౌన్‌ ఎస్‌ఐ నర్సింహ్మారావు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట కొత్త బస్టాండ్‌ సమీపంలోని సులభ్‌ కాంప్లెక్స్‌ వెనకాల సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల ఓ వ్యక్తి మృతదేహాన్ని ఆర్టీసీ సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా, మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండి దుర్వాసన వస్తోంది. మూడు, నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని, మృతుడి మెడలో దేవుడి తాయత్తు ఉండగా, బ్లూకలర్‌ పాయింట్‌, తెలుపు రంగు షర్ట్‌ ధరించి ఉన్నాడన్నారు. ఫిట్స్‌ లేదా సడన్‌గా గుండెపోటు లేదా వడదెబ్బతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నర్సాపూర్‌ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, మోడ్రన్‌ బస్టాండ్‌ చౌరస్తాల్లో తమ సిబ్బందితో కలిసి ఐదు రోజుల క్రితం డ్రంకెన్‌ డ్రైవ్‌ టెస్టులు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో 12 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. గురువారం వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి రూ.29వేల జరిమానా విధించారు.

మిత్రుడినంటూ ఫోన్‌కాల్‌
మెడికల్‌ ఎమర్జెన్సీ అంటూ టోకరా

వర్గల్‌(గజ్వేల్‌): సైబర్‌ కేటుగాళ్లు అమాయకులను ఏదోరకంగా బురిడీ కొట్టిస్తూనే ఉన్నారు. ఫ్రెండ్‌నని నమ్మించి మెడికల్‌ ఎమర్జెన్సీ ఉందంటూ వర్గల్‌ మండల వాసిని బోల్తా కొట్టించి ఒకరు రూ.75,000 కాజేశారు. ఆపై బాధితుడు అప్రమత్తమై జాతీయ హెల్ప్‌లైన్‌ నంబరుకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం సిద్దిపేట సీపీ ఎన్‌.శ్వేత ఒక ప్రకటనలో వెల్లడించారు. మండల పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన బాధితుడికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌ చేశాడు. ఫ్రెండ్‌ను అంటూ నమ్మబలికాడు. మెడికల్‌ ఎమర్జెన్సీ ఉందని, త్వరగా డబ్బులు కావాలని ఒక నంబరు పంపించాడు. అతని మాటలు నమ్మిన బాధితుడు మిత్రుడు ఆపదలో ఉన్నాడనే భావనతో మరో ఆలోచన లేకుండా ఆ నంబరుకు రూ.75,000 పంపించాడు. ఆ తర్వాత ఆ నంబరుకు ఫోన్‌ చేయగా, స్విచ్ఛాఫ్‌ వచ్చింది. దీంతో సైబర్‌ నేరగాళ్లు తనను మోసం చేశారని గుర్తించి 1930 నంబరుకు కాల్‌ చేసి ఫిర్యాదు చేశాడు.

కుంభమేళాకు రండి

నారాయణఖేడ్‌: న్యాల్‌కల్‌ మండలం రాఘవాపూర్‌ సమీపంలోని మంజీరానది వద్ద ఈ నెల 24నుంచి జరిగే మంజీరా కుంభమేళాకు రావాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. రాఘవాపూర్‌ సిద్దిసరస్వతి దేవస్థానం పీఠాధిపతి కాశీనాథ్‌బాబా, ఖేడ్‌ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో గురువారం బండి సంజయ్‌ను కలిశారు.

కేతకిలో నేటి నుంచి శతచండీ మహాయాగం


ఆలయ ఆవరణలో చలువ పందిళ్ల ఏర్పాటు

ఝరాసంగం(జహీరాబాద్‌): లోక కల్యాణార్థం శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయ ఆవరణలో మూడు రోజుల పాటు శత చండీ మహాయాగం నిర్వహించనున్నారు. కేతకి ఆలయ పాలక మండలి చైర్మన్‌ ఎస్‌.వెంకటేశం కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. కేతకి ఆలయ ఆవరణలో ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించే మహాయాగానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాయాగానికి వివిధ జిల్లాలోని ఆశ్రమాల పీఠాధిపతులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని లింగన్న పేటకు చెందిన దేశపతి సుదర్శన శర్మ, 25 మంది వేదపండితులచే యజ్ఞం నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలో అరటి చెట్లు, మామిడి ఆకుల తోరణాలతో ఏర్పాట్లు చేస్తున్నారు. యాగానికి వచ్చే భక్తులకు మూడురోజులపాటు అన్నప్రసాదాలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

కార్యక్రమ వివరాలు

- శుక్రవారం ఉదయం 6గంటలకు గురుప్రార్థన, గణపతి పూజ, గోపూజ, పుణ్యావాచనం, పంచగవ్య ప్రాశన, చండీ పారాయణ, శ్రీ యంత్ర స్థాపన పూజ, యోగిలి బలి, మంగళహారతి, సాయంత్రం 5:30 నిమిషాలకు ఆవాహిత దేవతాపూజ, నవార్ణజపం, మహామంగళహారతి, రాజోపచార పూజ.
- శనివారం ఉదయం 8గంటలకు ఆవాహిత దేవతా పూజ, శ్రీ యంత్ర స్థాపన పూజ, చండీ పారాయణ, మహామంగళహారతి, యోగిని బలి, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 5:30 గంలకు ఆవాహిత దేవతా పూజ, నవార్ణజపం, మహామంగళహారతి, రాజోపచార పూజ.
- ఆదివారం ఉదయం నుంచి ఆవాహిత దేవతా పూజ, గణపతి పూజ, పుణ్యహవాచనం, అగ్ని ప్రతిష్ఠ, చండీ వాహనం, నవార్థమంత్ర హవనం, ప్రాయచిత్త హోమాలు, బలి ప్రదానం, మహా పూర్ణాహుతి, సుహాసిని కుమారి పూజ, కలశోద్వాసన, అవబృత స్నానము, మహాదాశీర్వచనము, ఋత్విక్‌ సన్మానం, తీర్థప్రసాద వితరణ, మధ్యాహ్నం 12 గంటలకు మహాపూర్ణాహుతి పూజతో ముగించనున్నారు.

శివనామస్మరణ

అమావాస్య కావడంతో కేతకిలో భక్తుల రద్దీ


పూజలు అందుకుంటున్న పార్వతీపరమేశ్వరులు

ఝరాసంగం(జహీరాబాద్‌): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయం భక్తుల శివనామస్మరణతో మారుమోగింది. గురువారం అమావాస్య కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, జలలింగానికి పూజలు చేశారు. గర్భగుడిలోని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

ప్రత్యేక పూజలు

అభిషేకం, కేశఖండనం, కంట్లం, గుండం, వాహన తదితర ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ ఆవరణలోని బసవణ్ణమందిరం, నాగులకట్ట, బలభీముడి ఆలయం, పోగడ చెట్టు, నవగ్రహాల ఆలయాల్లో కూఆ పూజలు చేశారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


కేతకిలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య


కర్రోల్ల వెంకటరాములు (ఫైల్‌)

కౌడిపల్లి(నర్సాపూర్‌): వ్యవసాయంలో నష్టం.. సాగు కోసం రెండు బోర్లు వేయడంతో అప్పు పెరిగింది. దీంతో తీర్చే మార్గం లేక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మెదక్‌ జిల్లా కౌడిపల్లి మండలం వెల్మకన్నలో గురువారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రోల్ల వెంకట్రాములు (47) తనకున్న మూడెకరాల పొలంలో వరి సాగు చేస్తున్నాడు. పంట సాగు కోసం అప్పు చేసి రెండు బోర్లు వేశాడు. సాగులో నష్టాలు రావడంతో పాటు గతేడాది వ్యవసాయం కోసం తీసుకొచ్చిన ట్రాక్టర్‌ ఫైనాన్స్‌ డబ్బు కట్టాల్సిన సమయం వచ్చింది. కుల సంఘం వద్ద తెచ్చుకున్న రూ. 5 లక్షలు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై ఇంటి బయట కొట్టంలో బుధవారం రాత్రి పురుగు మందు తాగాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు తెలపడంతో నర్సాపూర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య శ్యామల, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్‌ రాజేందర్‌తో పాటు బీజేపీ మండల అధ్యక్షుడు రాకేష్‌, టీపీసీసీ డెలిగేట్స్‌ రవీంద్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్‌, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు పరామర్శించారు.

వీఓఏలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి


వీఓఏలకు మద్దతు తెలిపుతున్న శ్రీకాంత్‌గౌడ్‌ తదితరులు


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సాయిలు

పటాన్‌చెరు టౌన్‌: వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి, ఉద్యోగ భద్రత కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్‌ అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు పటాన్‌చెరు మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గురువారం గడీల శ్రీకాంత్‌ గౌడ్‌, గోదావరి అంజిరెడ్డి తదితరులు వారికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ గౌడ్‌ మాట్లాడుతూ వీఓఓలు అనేక పనులు చేస్తున్నా, వస్తున్న జీతం తక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌, పుణ్యవతి, కావలి వీరేశం, నరేందర్‌గౌడ్‌, రాజుగోపాల్‌యాదవ్‌, సంగమేష్‌, అజ్జు, ధన్‌రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

ఝరాసంగం(జహీరాబాద్‌): ఐకేపీ వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సాయిలు డిమాండ్‌ చేశారు. ఝరాసంగం ఐకేపీ కార్యాలయ ఆవరణలో చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన గురువారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలను సెర్ప్‌ ఉద్యోగులుగా గుర్తించి, ఐడీ కార్డులు అందించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు పద్మారాణి, కార్యదర్శి నింగమ్మ, ప్రధాన కార్యదర్శి ఖాజామియా, కోశాధికారి వసంత్‌ పాల్గొన్నారు.

లారీలో నుంచి రోడ్డుపైకి హిటాచీ



తృటిలో తప్పిన ప్రమాదం

రామాయంపేట(మెదక్‌): ట్రాలీ లారీలో తరలిస్తున్న హిటాచీ ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయిన సంఘటన గురువారం రామాయంపేటలో జరిగింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. లారీలో హిటాచీని సిద్దిపేట వైపు తరలిస్తున్న క్రమంలో లారీ వెనుక చక్రం రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. దీంతో హిటాచీ నడిరోడ్డుపై పడిపోయింది. ఆ సమయంలో ఎవరూ రోడ్డుపై లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మరో క్రేన్‌ సాయంతో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన హిటాచీని తొలగించారు.

ముస్లింల అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పలు మసీదుల్లో గురువారం ఇఫ్తార్‌ విందులు ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రుబీనా నజీబ్‌, మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ విజయ్‌బుజ్జి, కౌన్సిలర్లు మాజీద్‌, స్వప్న అభిషేక్‌ షెట్కార్‌ పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో...

నారాయణఖేడ్‌: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. నారాయణఖేడ్‌ క్యాంపు కార్యాలయంలో ముస్లింలకు గురువారం రంజాన్‌ తోఫాలు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్‌: సీఎం కేసీఆర్‌ మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్‌ అన్నారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్‌ గ్రామంలో గురువారం ముస్లింలకు నీలం మధు ముదిరాజ్‌ దుస్తుల పంపిణీ చేశారు.


నారాయణఖేడ్‌: రంజాన్‌ తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


దుస్తులు పంపిణీ చేస్తున్న నీలం మధు ముదిరాజ్‌

వ్యక్తి అదృశ్యం

సిద్దిపేటకమాన్‌: వ్యక్తి అదృశ్యమైన ఘటన సిద్దిపేట టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కమాన్‌ ఏరియాలో నివాసముంటున్న కొర్తివాడ వెంకటేశం మానసికంగా ఇబ్బంది పడుతున్నానని, బతకాలని లేదని ఈనెల 19వ తేదీన లెటర్‌ రాసి ఇంట్లో పెట్టాడు. గురువారం ఉదయం ఇంట్లో వారికి గుడికి వెళుతున్నానని చెప్పాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో, అతడు రాసిన లెటర్‌ కుటుంబసభ్యులు గుర్తించి వెంటేశంకు ఫోన్‌ చేయగా, స్విచ్ఛాప్‌ అని వచ్చింది. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో వెంకటేశం కుమారుడు రవితేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సబ్‌ రిజిస్ట్రార్‌ ఆఫీస్‌ను ప్రైవేట్‌ భవనంలోకి తరలించొద్దు


తహసీల్దార్‌ మనోహర్‌ చక్రవర్తికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాన్ని ప్రైవేట్‌ భవనంలోని తరలించొద్దని పట్టణ సీపీఐ కార్యదర్శి పి. వినోద డిమాండ్‌ చేశారు. గురువారం తహసీల్దార్‌ మనోహర్‌ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పరిధిలో ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నా, బైపాస్‌ రోడ్డు వైజంక్షన్‌ వద్ద నిర్మించిన ప్రైవేట్‌ భవనంలోకి తరలించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌.లక్ష్మి, ఎం.రమేష్‌, ఎండీ ముస్తఫా, ఉమర్‌, ముంగి రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కుప్పను ఢీకొని వ్యక్తి మృతి


యాదయ్య(ఫైల్‌)

కొండపాక(గజ్వేల్‌): రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పను ఢీకొని ఒకరు మృతి చెందారు. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్‌ తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రమైన కొండపాకకు చెందిన దొంతరబోయిన యాదయ్య(60) బుధవారం రాత్రి ఇంటి నుంచి బైక్‌పై రవీంద్రనగర్‌కు వెళుతున్నాడు. మార్గమధ్యలో బిన్నీరైస్‌మిల్లు ఎదుట రోడ్డపై రైతు నర్సయ్య ధాన్యం కుప్ప పోసి కవర్‌ కప్పాడు. బైక్‌పై వెళుతున్న యాదయ్య ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. దీంతో ఆయన తలకు బలమైన గాయాలయ్యాయి. అటుగా వెళుతున్నవారు చూసి యాదయ్య కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. తన తండ్రి మృతికి నర్సయ్య కారణమంటూ మృతుని కుమారుడు భాను ప్రకాశ్‌ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా నర్సయ్య ఇంటి సమీపంలో యాదయ్య మృతదేహాన్ని ఉంచి కుటుంసభ్యులు ఆందోళనకు దిగారు. అరగంటపాటు ఆందోళన సాగడంతో ఉద్రిక్త పిరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మృతుడి బంధువులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు సన్మానం

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): గంగ్వార్‌ చౌరస్తా వద్ద గురువారం గోషామహల్‌ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను మండల బీజేపీ నాయకులు సన్మానించారు. బీదర్‌ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా ఈశ్వర్‌సింగ్‌ ఠాకూర్‌ వేసే నామినేషన్‌ కార్యక్రమానికి రాజాసింగ్‌ తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బీదర్‌ వెళ్తున్న ఎమ్మెల్యేను గంగ్వార్‌ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు మల్లేష్‌, పూల సంతోష్‌, విశ్వనాథ్‌, ఓంకార్‌, సుదర్శన్‌రెడ్డి, నర్సింహులు తదితరులు రాజాసింగ్‌ను సన్మానించారు.


గంగ్వార్‌ వద్ద రాజాసింగ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

సెల్‌టవర్‌ ఎక్కితే ఎలా?

వరుస ఘటనలతో పోలీసులకు తలనొప్పి


సెల్‌టవర్‌ పైన రాజశేఖర్‌(ఫైల్‌)

జోగిపేట(అందోల్‌): వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం ఇటీవలి కాలంలో సెల్‌టవర్లు ఎక్కి ఆందోళన వ్యక్తం చేయడం పరిపాటిగా మారింది. అధికారుల, ప్రజాప్రతినిధుల వద్దకో వెళితే సరిపోతుంది కదా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జోగిపేట పరిధిలో వారం రోజుల్లోనే ముగ్గురు టవర్‌పైకి ఎక్కి గంటల కొద్దీ అక్కడే ఉంటూ సెల్‌ఫోన్‌లో తమ డిమాండ్లు వ్యక్తపరిచారు. మొదటగా రాందాస్‌ తనకు డబుల్‌ బెడ్‌రూం రాకుండా రాజకీయ నాయకులే అడ్డుకుంటున్నారని నిరసన తెలిపాడు. పోలీసులు అతడిని కిందకు దింపేందుకు నానా కష్టాలు పడాల్సి వచ్చింది. బుధవారం అర్ధరాత్రి వరకు రాజశేఖర్‌ తమ కుటుంబంలో నలుగురు ఉన్నా ఒక్కరికి కూడా డబుల్‌బెడ్‌ రూం రాలేదని, ఇచ్చేంతవరకు తాను టవర్‌ దిగేది లేదంటూ రెండున్నర గంటల పాటు టవర్‌పై హల్‌చల్‌ చేశారు. ఎస్‌ఐ -2 పెంటయ్య సిబ్బందితో వచ్చి ఎమ్మెల్యే వద్దకు తీసుకెళ్లి ఇప్పిస్తానని చెప్పి కిందకు దిగేలా చేశారు. గురువారం ఉదయం కూడా మరొక యువకుడు కూడా టవర్‌పై ఎక్కడానికి ప్రయత్నిస్తుండగానే అడ్డుకున్నారు. ఇలా ప్రతిరోజు ఎవరోఒకరు టవర్‌పైకి ఎక్కి నిరసన తెలుపుతున్నారు. టవర్‌ ఎక్కకుండా ఆ ప్రాంతంలో కంచె వేసి కట్టుదిట్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దావత్‌కు వెళ్లి వస్తుండగా...

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారుల మృతి
- రంజాన్‌ వేళ విషాదం


సాక్లయిన్‌ (ఫైల్‌)


రిహాన్‌ (ఫైల్‌)

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): దావత్‌ కు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. సదాశివపేట సీఐ నవీన్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నందికంది గ్రామానికి చెందిన ఫిరోజ్‌ హవల్‌(మౌలానా) తన కుమారుడు సాక్లయిన్‌ (8), మరో బాలుడు రిహాన్‌(12)తో కలిసి బైక్‌పై వెళ్లి గురువారం సాయంత్రం మసీదులో రంజాన్‌ ప్రార్థనలు చేశాడు. అనంతరం మసీద్‌ సమీపంలో గల ఓ ఇంట్లో జరిగిన దావత్‌కు వెళ్లి ఇంటికి తిరుగు పయనమయ్యారు. నందికంది గ్రామంలో జాతీయ రహదారిని దాటుతుండగా సదాశివపేట నుంచి సంగారెడ్డి వైపు వెళుతున్న ట్యాంకర్‌ లారీ అతివేగంగా వీరి ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొంది. దీంతో సాక్లిన్‌ ,రెహాన్‌లు తల పగిలి అక్కడికక్కడే మృతి చెందారు. ఫిరోజ్‌ హవల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

డ్రైవర్‌ను అప్పగించాలంటూ పోలీసులతో వాగ్వాదం

ట్యాంకర్‌ డ్రైవర్‌ నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు చిన్నారులు మృతి చెందార, వారి మృతికి కారణమైన డ్రైవర్‌ను తమకు అప్పగించాలంటూ కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం ఏర్పడింది. దీంతో డ్రైవర్‌ను పోలీసులు సదాశివపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.